క్లుప్తంగా

ప్రజలకు అందుబాటులో ఉండండి



సచివాలయంలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి

కల్లూరు: గ్రామ సచివాలయాల ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీఓ నాగశేషాచల రెడ్డి తెలిపారు. గురువారం ఆయన కె.మార్కాపురం, బస్తిపాడు గ్రామ సచివాలయాలను ఈఓఆర్డీ నాగేష్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సచివాలయాల్లో హాజరు పట్టి, ఇతర రికార్డులను పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఎస్‌పీసీఐ మ్యాపింగ్, ఇంటింటి జియోట్యాగింగ్ సకాలంలో పూర్తి చేయాలన్నారు. అలాగే పర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ప్రత్యేక ఆధార్ క్యాంప్‌ను ఎంపీడీఓ పరిశీలించారు.

కూలీలు సమయపాలన పాటించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ మోదీన్‌బాషా

కోడుమూరు రూరల్ : ఉపాధి కూలీలు సమయపాలన పాటించాలని ఏపీఓ మోదీన్‌బాషా సూచించారు. మండల కేంద్రం కోడుమూరులో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం ఏపీఓ తనిఖీ చేశారు. కూలీల హాజరు, మస్టర్లను పరిశీలించారు. ఏపీఓ మాటాడుతూ కూలీలు ఉదయాన్నే పనుల్లోకి వచ్చి మధ్యాహ్నంలోపు వెళ్లాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారం పనులు చేపడితే రోజువారి వేతనం రూ.300 పడుతుందన్నారు. ఉపాధి కూలీల సంఖ్యను మరింత పెంచాలని ఏపీఓ సిబ్బందిని ఆదేశించారు.

తాగునీటి వసతి కల్పించండి



ఎంపీడీఓ రాణెమ్మకు సమస్యలు విన్నవిస్తున్న కంబదహాల్ గ్రామస్తులు

సి.బెళగల్: తాగునీటి వసతి కల్పించాలని ఎంపీడీఓ రాణెమ్మను మండల పరిధిలోని కంబదహాల్ గ్రామం కొత్త ఎస్సీ కాలనీ వాసులు కోరారు. ఈ మేరకు గురువారం వారు ఎంపీడీఓను కలిసి సమస్యలను విన్నవించారు. మంచినీటి సౌకర్యంతోపాటు వీధి లైట్లు లేక ఇబ్బందులు పడుతున్నామని ఆ కాలనీ వాసులు శంకర్, కరుణాకర్ ఎంపీడీఓ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎంపీడీఓ త్వరగా సమస్యలు పరిష్కరించాని ఈఓఆర్డీ ఈశ్వరయ్యస్వామికి సూచించారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



దుంపలను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు

పాణ్యం: పకృతి వ్యవసాయం లాభదాయమని ఎస్‌పీఎంయూ ట్రైనీ ఎన్‌ఎఫ్‌ఏ ఉషారాణి అడిషనల్ డీపీఎం అబ్దుల్‌సలాం తెలిపారు. మండల పరిధిలోని భూపనపాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన పంటలను గురువారం వారు పరిశీలించారు. వరిలోని ఏ గ్రేడ్ మోడల్ పంటను, దుంపలు, పూలమొక్కలను పరిశీలించారు. కార్యక్రమంలో సిబ్బంది, శ్రీనివాసులు, గోపాల్, భాస్కర్, రామసుబ్బయ్య కృష్ణుడు, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మానవత వనభోజనం

కర్నూలు కల్చరల్: మానవత సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు కర్నూలు మండలం ఉలిందకొండ సమీపంలోని సాయి సన్నిధి రిసార్ట్‌లో వన భోజన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కుల మతాలకు అతీతంగా మానవత ఆధ్వర్యంలో వన భోజన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అందరూ పాల్గొనవచ్చని విజ్ఞప్తి చేశారు.

కలెక్టర్‌ను కలిసిన డ్వామా పీడీ

కర్నూలు(సెంట్రల్): డ్వామా పీడీగా నియమితులైన పి.వెంకటరమణయ్య గురువారం జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌ను ఆయన చాంబరులో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఉపాధి పనుల కల్పనపై దృష్టి సారించాలని కలెక్టర్ పీడీకి సూచించినట్లు సమాచారం.

ఆదాయం ఘనం... వసతులు శూన్యం

- ప్రసిద్ధ వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయ పరిస్థితి
- భక్తులకు కనీస మౌలిక సౌకర్యాలు కరువు
- మహిళల ఇబ్బందులు వర్ణనాతీతం
- స్నానాలు, అత్యవసరాలు చెట్లచాటునే



ప్రత్యేక అలంకరణలో వెంకాయపల్లె ఎల్లమ్మ



తాగునీటి కుళాయిల దగ్గరే స్నానం చేస్తున్న భక్తురాలు



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

కర్నూలు (రూరల్): జిల్లా కేంద్రం కర్నూలు సమీపాన వెలసిన వెంకాయపల్లె ఎల్లమ్మ పిలుస్తే పలికే అమ్మగా వెలుగొందుతోంది. తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు వస్తుంటారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో అమ్మవారిని ఇంటి ఇలవేల్పుగా కొలుస్తారు. ప్రతి మంగళవారం క్రమం తప్పకుండా దర్శించుకునే భక్తులూ ఉన్నారు. ఉదయం నుంచే భక్తులు బారులుదీరుతారు. గంటల తరబడి క్యూలో నిల్చుని ఎల్లమ్మను దర్శించుకుంటారు. వేసవి, వివాహ దినాల్లోనూ భక్తుల తాకిడి మరీ ఎక్కువ. భారతాల పౌర్ణమి(అమ్మవారి జయంతి), దసర పండగరోజు తదితర ప్రత్యేక దినాల్లో భక్తుల సంఖ్య నాలుగింతలు పెరుగుతుంది. అమ్మవారిని దర్శించుకునేందు ఇలాంటి రోజుల్లో ఏడెనిమది గంటల సమయం పడుతుంది. చాలా కుటుంబాలు ప్రతియేటా ఎల్లమను దర్శించుకోవాల్సిందే. ఇంటో శుభ కార్యం చేయాలంటే ముందుగా అమ్మవారికి చేయాల్సి ఉంటుంది. బంధు, మిత్ర సమేతంగా ట్రాక్టర్లు, లారీలలో వస్తుంటారు. మాంసాహారం విందు ఉంటుంది. దీంతో ఆలయ పరిసరాలు జనంతో కిక్కిరిసిపోతుంది. చేలు, చెట్లు నిండిపోతుంటాయి. మరికొందరు కొత్త దంపతులు ముందుగా ఎల్లమ్మను దర్శించుకునేందుకే వివాహాలు సైతం ఎల్లమ ఆలయ సమీపంలోని ఫంక్షన్ హాల్‌లోనే చేసుకుంటుంటారు. వివాహం అనంతరం అమ్మవారిని దర్శించుకుంటారు. భక్తుల ఆరాధ్యదైవమైన అమ్మవారికి ఆదాయం ఏటా 70 లక్షల వరకు ఉంటుందని అంచనా. ఇంత ప్రసిద్ధి చెందిన అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు కనీసం మౌలిక వసతులు కరువయ్యాయి. ఆదాయం ఘనం, వసతులు శూన్యం అన్న చందంగా మారింది. ఎంతో భక్తితో వచ్చిన భక్తులకు ఇక్కడ కనీస వసతులు లేకపోవడంతో అసహనానికి గురవుతున్నారు.

కొట్టాలు కిటకిటా...

ఎల్లమ్మకు చేసేందుకు వచ్చే భక్తులు వంటలు చేసుకునేందుకు ఆలయ పరిసరాలలో నిర్మించిన ప్రైవేట్ కొట్టాలు కిటకిటలాడుతుంటాయి. అద్దె రూ. రెండవేల నుంచి మూడు వేలు చెల్లించినా వసతులు అంతంత మాత్రమే. కేవలం వంటవార్పుకు మాత్రం ఇంత మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. ఉన్నత వర్గాలకు అనుగుణంగా ఏడెనిమిది ఫంక్షన్ హాల్‌లు కూడా ఉన్నాయి. సకల వసతులు ఉంటాయి. అయితే రూ. 7 వేల నుంచి రూ. 15 వేల వరకు ఫంక్షన్ హాల్‌కు చెల్లించాల్సి ఉంటుంది. ఇక ప్రైవేట్ కొట్టాలు యాభైకిపైగానే ఉంటాయి. ఇవి కూడా భక్తులతో నిండిపోతుంటాయి. ఈ నేపథ్యంలో పేద, మధ్య తరగతి భక్తులకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. మహిళల పరిస్థితి మరీ అధ్వానం. స్నానాలు ఆచరించేందుకు, అత్యవసరాలకు చెట్ల చాటుకు వెళ్లాల్సిన దుస్థితి. కనీసం స్నానాలకు తాత్కాళికంగా పందిర్లు ఏర్పాటు చేయని ఆలయ అధికారుల తీరును భక్తులు తప్పుపడుతున్నారు.

భక్తులతో నిత్యం ట్రాఫిక్ జామ్

కర్నూలు సమీపాన గుంటూరు ప్రధాన రహదారిలో వెలసిన వెంకాయపల్లె ఎల్లమ్మ దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులతో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుంది. ఆయల సమపాన రోడ్డుపై భక్తులు చేరడంతో రాకపోకలు స్తంభిస్తుంటాయి. ఇంకో విధంగా చెప్పాలంటే మంగళవారం అటు వెళ్లాంటే ట్రాఫిక్ జామ్ గుర్తుకొస్తుంటుంది వాహనచోదకులు. గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అయిన సందర్భాలు కోకొల్లలు.

మౌలిక వసతులు కల్పించాలి



అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. మహిళల అవసరాలపై కనీస ఆలోచన చేయకపోడం ఏ మాత్రం సమంజసం కాదు. స్నానాలు, బట్టలు మార్చుకునేందుకు తోటి మహిళలను అడ్డుపెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. పేరొందిన అమ్మవారి ఆలయంలో ఇలాంటి పరిస్థితులు ఎదుర్కోవడం బాధగా ఉంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి మౌలిక వసతులు కల్పించి. ముందుగా తాత్కాలిక పందిర్లు ఏర్పాటు చేయాలి.

– వరలక్ష్మి, భక్తురాలు, నందనపల్లె గ్రామం

చాలా ఇబ్బందిగా ఉంది



స్నానం చేసేందుకు చాలా ఇబ్బందిగా ఉంది. తాత్కాళిక వసతులు కల్పించకపోడం అన్యాయం. బట్టలు మార్చుకునేందుకు పడరానిపాట్లు పడుతున్నాం. చెట్ల సమీపానికి వెళ్లినా పురుషులు గుంపుగుంపులుగా ఉంటున్నారు. కనీసం బట్టలు మర్చుకోవడనికి తాత్కలిక పందిర్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా ఆ దిశగా ఆలయ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కల్పన, భక్తురాలు, సూదిరేడ్డిపల్లె గ్రామం

త్వరలో సమస్యలు పరిష్కారం



భక్తులు ఇబ్బందులు పడుతున్న విషయం వాస్తవమే. సమస్యల పరిష్కారానికి తమ వంతు చర్యలు చేపట్టాం. రూ.40 లక్షలతో 12 మరుగు దొడ్లు, 4 స్నానపు గదులు నిర్మించడానికి ఆన్‌లైన్ టెండర్ పిలిచాం. కంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ తీసుకోవాల్సి ఉంది. వీలైనంత త్వరలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తాం. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం.

– పి.దినేష్, ఆలయ ఈఓ

చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలి



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న మంజుల వాణి

కల్లూరు: చెత్త సంపద కేంద్రాలను (ఎస్‌డబ్ల్యూపీసీ) వినియోగంలోకి తేవాలని డీపీఆర్సీ జిల్లా కోఆర్డినేటర్ మంజుల వాణి సూచించారు. మండల పరిధిలోని పెద్దటేకూరు గ్రామం చెత్త సంపద కేంద్రాన్ని గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెత్త సంపద కేంద్రాల్లో వర్మీకంపోస్టు ఎరువు తయారు చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. తడి, పొడి చెత్త, గాజుసీసాలు వేరు వేరుగా సేకరించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే గ్రామంలో ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంక్ దగ్గర ఇన్‌లైన్ క్లోరినేషన్‌ను పరిశీలించారు. అనంతరం సచివాలయంలో రిజిస్టర్లను, రికార్డులను తనిఖీ చేశారు.

24న బలిజ కార్తీక వనభోజనాలు

కర్నూలు(అర్బన్): నగర కాపు, తెలగ, బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 24న కార్తీక వనభోజన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గాండ్ల లక్ష్మన్న, రవికుమార్ తెలిపారు. గురువారం స్థానిక ఐదు రోడ్ల కూడలిలోని కార్యాలయంలో వనభోజన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వెనుక ఉన్న విజ్ఞాన పీఠంలో వనభోజన కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. నగరం చుట్టుపక్కల ప్రాంతాల వారు హాజరయ్యేందుకు వీలుగా బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సాంస్కతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు, జబర్దస్త్ టీం వారిచే హాస్య కార్యక్రమాలు ఉంటాయన్నారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు. సంఘం నాయకులు శైలేష్, వెంకటేశ్వర్లు, అనిమిరెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ పాఠశాలలోకి కేసీ నీరు!



నీటిలో నడుచుకుంటూ వస్తున్న విద్యార్థులు



పాఠశాల ప్రాంగణంలో నిలిచిన కేసీ నీరు

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల జెడ్పీ పాఠశాలలోకి కేసీ నీరు రావడంతో ప్రాంగణం జలమయంగా మారాయి. కేసీ కాలువకు నీరు అధికంగా రావడంతో చుట్టు ప్రక్కల పొలాల నుంచి స్కూల్ ఆవరణంలోకి నీరు నిలిచింది. దీంతో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు తరగతి గదులకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కేసీ కాలువ బాగలేకపోవడంతో నీరు స్కూల్‌లోకి వచ్చిందని గ్రామస్తులు చెబుతున్నారు. తరగతి గదుల ముందర నీరు నిల్వ ఉండటంతో స్పందించిన హెచ్‌ఎం రాజేంద్రప్రసాద్ జేసీబీ సాయంతో కాలువ తీయించడంతో కొంత నీరు బయటి వెళ్లింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కేసీ నీరు పాఠశాలలోకి రాకుండా చూడాలని విద్యార్థులు కోరుతున్నారు.

26న కలెక్టరేట్ ముట్టడి



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

ఓర్వకల్లు: రైతు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై ఈ నెల 26న తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో అఖిలపక్ష రైతు, కార్మిక సంఘాల సమావేశం నిర్వహించారు. ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. కేంద్రం రైతు, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని విమర్శించారు. బ్రిటీష్ కాలంలో అనేక పోరాటాలు, ఉద్యమాలతో కార్మికులు సాధించుకున్న చట్టాలను నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చి కేంద్రం అన్యాయం చేస్తుందన్నారు. సమావేశంలో రైతు సంఘం మండల కార్యదర్శి సుధాకర్, మండల అధ్యక్షుడు మధుసూదన్, సీఐటీయూ మండల నాయకులు సుధాకర్, మాసూం బాష తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కారమయ్యేనా?

- గ్రామ సభలలో వచ్చిన 1,433 దరఖాస్తులు
- రైతులకు తప్పని ఎదురు చూపులు



పిన్నాపురంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ నరేద్రనాథ్‌రెడ్డి (ఫైల్)

పాణ్యం: టీడీపీ కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టిన రీ సర్వేకు సంబంధించి నెలకొన్న సమస్యలకు పరిష్కార చర్యలు తీసుకునేలోపే ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో అలాగే ఉండిపోయాయి. అయితే కూటమి సర్కార్ గత ప్రభుత్వం తీరును తప్పుపడుతూ రీ సర్వే జరిగిన గ్రామల్లో భూ క్రయ విక్రయాలు, రిజిస్ట్రేషన్‌లు ఆపేసింది. ఎక్కడ సమస్యలు అక్కడే అన్నట్లుగా ఉండిపోయాయి. దీంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. రైతుల నుంచి ఫిర్యాదులు, రెవెన్యూ అదాయం భారీగా తగ్గడంతో కూటమి ప్రభుత్వం గ్రామ సభలను ఏర్పాటు చేసింది. ప్రభుత్వానికి పెద్ద ఎత్తున రెవెన్యూలోటు కనబడడంతో గత నెలలో గ్రామసభలు నిర్వహించారు. భూ సమస్యలు ఉన్న రైతుల నుంచి ఆర్జీలు స్వీకరించారు రెవెన్యూ అధికారులు. అయితే పరిష్కార చర్యలు జాప్యం అవుతుందని రైతులు వాపోతున్నారు. దీంతో ప్రభుత్వ తీరును తప్పు పడుతున్నారు బాధిత రైతులు.

అత్యధికంగా జాయింట్ ఎల్‌పీ సమస్యలే...

మండలంలో మొత్తం 14 గ్రామాల్లో రెవెన్యూ అధికారులు గ్రామ సభలు జరిపారు. మొత్తం 1433 దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా జాయింట్ ఎల్‌పీ–396 దరఖాస్తులు వచ్చాయి. ఎక్స్‌ంట్ వేరియేషన్– 401, మ్యూటేషన్–235, క్లాసిఫికేషన్–377, పేరు మార్పు–3, మల్టిపుల్ ఖాతా–1చొప్పున అర్జీలు వచ్చాయి. ప్రతి ఆర్జీని ఆన్‌లైన్ చేశారు. ప్రస్తుతం ఎల్‌పీ వచ్చిన ఆర్జీలను అధికారులు పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నారు. సర్వే నంబర్లుకు బదులు రీ సర్వేలో ఎల్‌పీ నంబర్లను ఇచ్చారు. ఈ ఎల్‌పీనంబర్లలోకి కొన్ని సర్వే నంబర్లను చేసి ఒక ఎల్‌పీగా కేటాయించారు. భూ సమస్యలను త్వరగా పరిష్కరించాలని అర్జీదారులు కోరుతున్నారు.

డిసెంబర్ వరకు గడువు ఉంది

గ్రామ సభల్లో వచ్చిన ప్రతి ఆర్జీని ఆన్‌లైన్ చేశాం. ప్రస్తుతం గ్రామాల వారీగా మొదటి ప్రాధాన్యతగా ఎల్‌పీ నంబర్లకు వచ్చిన దరఖాస్తులను పరిష్కరిస్తున్నాం. రైతులు సమన్వయంతో క్షేత్రస్థాయిలోకి వెళ్లి కొలతలు తేడాపై వచ్చిన ఆర్జీలను మా వద్ద ఉన్న పాత రికార్డుల ఆధారంగా అక్కడే పరిష్కరిస్తున్నాం. అదేవిధంగా మిగిలిన భూ సమస్యలపై అధ్యయనం చేస్తున్నాం. రీ సర్వేలో నెలకొన్న భూ సమస్యలు పరిష్కరించేందుకు డిసెంబర్ చివరి వరకు గడువు ఉంది. మరో మారు సమస్య రాకుండా శాశ్విత పరిష్కారించందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– శివంకర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు

కర్నూలు (టౌన్): నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ రవీంద్రబాబు స్పష్టం చేశారు. గురువారం రహదారుల భద్రత కమిటీ నిర్ణయాల అమలుకు సంబంధించి కమిషనర్ ఆర్‌అండ్‌బీ, ట్రాఫిక్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి నగరంలో పర్యటించారు. బిర్లా కాంపౌండ్, గాయత్రీ ఎస్టేట్, సి.క్యాంపు, నంద్యాల చెక్‌పోస్టు, వై.జంక్షన్, కొండారెడ్డి బురుజు ప్రాంతాల్లో అధికారులు పర్యటించి స్థానికంగా ట్రాఫిక్ ఇబ్బందులు, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. ఆర్‌అండ్‌బీ ఎస్ఈ మహేశ్వర రెడ్డి, ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డును కప్పేసిన కంపచెట్లు!



రోడ్డును కప్పేసిన ముళ్లపొదలు

కల్లూరు: మండల పరిధిలోని బస్తిపాడు గ్రామం నుంచి లక్ష్మీపురం గ్రామం వైపు వెళ్లే రోడ్డుకు ఇరువైపుల ముళ్లపొదలు పెరిగాయి. బస్తిపాడు గ్రామానికి చెందిన రైతులు, వ్యవసాయల కూలీలు, అలాగే కర్నూలు నుంచి అనుగొండ గ్రామానికి వెళ్లే బస్సులు, ఇతర ప్రయాణికులు నిత్యం రోడ్డుపై ప్రయాణిస్తుంటారు. బస్తిపాడు గ్రామ పరిసర ప్రాంతంలోని కొండల మధ్య ప్రాంతంలో రోడ్డు మలుపులు తిరిగి ఉంటుంది. రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు ఏపుగా పెరిగాయి. కొన్ని చోట్ల రోడ్డు మలుపులను చూపించే సూచిక బోర్డులు సైతం మొక్కలో కలిసి పోయాయి. దీంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్లపొదలను, మొక్కలను తొలగించాలని రైతులు, ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు. అలాగే బస్తిపాడు హంద్రీ బ్రిడ్జి దగ్గర ఏర్పటు చేసిన సూచిక బోర్డులు సైతం కపడడం లేదు. ఈ బ్రిడ్జిపై నిత్యం వాహనాలు తిరుగుతుంటాయి. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



మలుపులో రోడ్డుపైకి వచ్చిన ముళ్లపొదలు



ప్రమాదకర మలుపులో సూచిక బోర్డును కప్పివేసిన కంపచెట్లు

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



సంత బజారులో దుర్గా మాత విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న గ్రామస్తులు



వేటసోమప్ప ఆలయ ప్రాంగణంలో ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో గురువారం నూతన ఆలయాలు, విగ్రహ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠోత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా వేద పండితులు యంత్రాభిషేకం, దీక్షా హోమాలు చేశారు. దేవతా మూర్తుల పీఠాల దగ్గర యంత్ర ప్రతిష్ఠను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం సంత బజారులో దుర్గామాత విగ్రహం, నాభిశిల పునః ప్రతిష్ఠ, కలశస్థాపన కార్యక్రమాలను చేపట్టారు. అదేవిధంగా పోలకల్ సమీపాన పల్‌దొడ్డి దారిలో వేటసోమప్ప ఆలయ ప్రారంభం, శివలింగం, నంది, గణపతి, కుమారస్వామి, సుబ్రహ్మణ్య స్వాముల విగ్రహాలను ప్రతిష్ఠించారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేవరకు పోరాటం



వర్కూరులో సచివాలయ సిబ్బందికి వినతి పత్రమిస్తున్న సీపీఐ నాయకులు

కోడుమూరు రూరల్ : ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ ఇంటి పట్టాలు ఇవ్వడంతోపాటు గృహాలు మంజూరు చేసేవరకు పోరాటం సాగిస్తామని సీపీఐ మండల కార్యదర్శి రాజు హెచ్చరించారు. ఈ మేరకు గురువారం మండలంలోని వర్కూరు గ్రామ సచివాలయం ఎదుట సీపీఐ నాయకులు ప్రజలతో కలిసి ధర్నా నిర్వహించారు. రాజు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి అర్హులైన వారికి స్థలాలు, స్థలాలున్న వారికి ఇల్లు కట్టుకునేందుకు రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బాషా, మునిస్వామి, రంగడు, లక్ష్మన్న, లక్ష్మిదేవమ్మ తదితరులు పాల్గొన్నారు.